క్లుప్తంగా

సర్పంచ్ దంపతులకు మాజీ మంత్రి ఆశీస్సులు



బహుమతి అందిస్తున్న మాజీమంత్రి ఆర్కే రోజా

నగరి: మండలంలోని వీకేఆర్‌పురం గ్రామ సర్పంచ్ నందిని, సతీష్ దంపతులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా ఆశీర్వదించారు. శుక్రవారం గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఆమె వారికి బహుమతులు ఇచ్చి ఆశీస్సులు అందజేశారు. ఆమె వెంట ఆర్బీకే మాజీ చైర్మన్ బుజ్జిరెడ్డి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీటీసీ ఇమ్రాన్‌ఖాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మెగా పేరెంట్స్ సమావేశం

విజయపురం : మండలంలోని శ్రీహరిపురం, జంబాడ, విజయపురం ఉన్నత పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశానికి పాఠశాల కమిటీ సభ్యులతోపాటు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులు, విద్యావేత్తలు స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోరారు. ఈ సమావేశంలో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలతోపాటు, క్రీడలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేస్తామని వారు తెలిపారు. విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు.

ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్డు వేయండి



బురదమయంగా ఉన్న ఎస్టీ కాలనీ రోడ్డు

విజయపురం: మండలంలోని మాధవరం పంచాయతీ ఎల్లసముంద్రం ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్డు వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ కాలనీలో 50కి పైగా ఎస్టీ కుటుంబాలు నివాసం ఉన్నాయి. రోడ్డు వసతులు లేక అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్డు బురదమయంగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై వెళ్లలేక బురదలో నడిచి ఇంటికి వెళ్లుతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఇంటి వదలి బయటకు రావడం లేదు. అధికారులకు ఎన్ని సార్లు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదు. అటు అధికారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు ఎస్టీలన్నా, ఎస్టీ కాలనీ అన్నా చులకన భావం ఉందని, అందుకే ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పాలసముద్రం ఎస్‌ఐగా చిన్నరెడ్డెప్ప



పాలసముద్రం: స్థానిక పాలసముద్రం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా చిన్న రెడ్డెప్ప శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కళ్యాణిడ్యామ్ పోలీస్ ట్రెనింగ్ సెంటర్ నుంచి పాలసముద్రం ఎస్ఐగా వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతర కృషి చేస్తామని తెలిపారు. నాటుసారా విక్రయాలు, తయారీ, ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వేపంజేరి విద్యార్థుల విజయకేతనం



విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుంద్రం జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో జరిగిన జోనల్ స్థాయి పోటీలలో వేపంజేరి విద్యార్థులు త్రోబాల్ పోటీలలో మొదటి స్థానంలో నిలిచి విజయకేతనం ఎగరవేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు జయచంద్రను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మంగుంటలో పట్టపగలే రెండిళ్లలో చోరీ

శ్రీరంగరాజపురం: పట్టపగలే చోరీ జరిగిన సంఘటన మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సుమన్ కథనం మేరకు మంగుంట గ్రామానికి చెందిన భువనేశ్వరి ఇంటికి తాళాలు వేసి పొలం వద్దకు వెళ్లింది. అదే గ్రామానికి చెందిన చంద్రబాబురెడ్డి ఇంటిలో ఎవరూ లేని సమయాన్ని గుర్తించిన దుండగులు ఈ రెండు ఇళ్లలో తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. భువనేశ్వరి ఇంటిలో 10 గ్రాముల బంగారు ఆభరణాన్ని అపహరించినట్లు తెలిపారు. చంద్రబాబురెడ్డి ఇంటిలో రూ.20 వేల రూపాయలు నగదు చోరీ అయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ పేర్కొన్నారు.

బీమా భారం





నగరిలో వరి నాట్లు, (ఇన్‌సెట్) విజయపురంలో వరి పొలాలన్ని సిద్ధం చేస్తున్న రైతులు

- రైతులే ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వ నిర్ణయం
- టీడీపీ ప్రభుత్వ తీరుతో రైతులకు అవస్థలు

వడమాలపేట(విజయపురం): కూటమి ప్రభుత్వం రైతు నెత్తిన బీమా భారం మోపింది. ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగు చేసుకుంటున్న పంటలకు బీమా ప్రీమియం మొత్తాన్ని రైతులే చెల్లించాలని ప్రభుత్వ ఆదేశించడంపై రైతాంగం మండిపడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023 రబీ సీజన్‌లో రైతుల తరఫున పంటల బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించింది. అయితే కూటమి ప్రభుత్వం బీమా మొత్తాన్ని రైతులే చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ.20 వేలు రైతుల ఖాతాలకు జమ చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ హామీని విస్మరించి, బీమా సైతం కట్టమని చెప్పడం సరికాదని అంటున్నారు.

గత ప్రభుత్వంలో.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల తరఫున ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించింది. దీంతోపాటు పంట సాగు చేసే ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.15వేలు మొత్తాన్ని రైతు ఖాతాలకు క్రమం తప్పకుండా జమ చేస్తూ వచ్చింది. దీంతో ఖరీఫ్, రబీకి అవసరమైన సాయం అందడంతో అప్పు చేయకుండా పంట సాగు చేసుకుని సంతోషంగా ఉన్నారు. అయితే

ప్రీమియం భారం రూ.కోటి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ప్రభుత్వం ఏర్పడి 6 నెలలైనా ఇంత వరకు రైతులకు ఎలాంటి సాయం అందించపోగా, రైతులతో బీమా ప్రీమియం చెల్లించడం ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి జిల్లాలోని రైతులు వరికి రూ.630, వేరుశనగకు రూ.450, చిత్తూరు జిల్లాలోని రైతులు వరికి రూ.84, వేరుశనగకు రూ.60 కట్టాలని ప్రభుత్వ ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

రైతులకు గడ్డు కాలం

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాతలకు సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ.20 వేలు రైతుల ఖాతాలకు జమ చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ హామీని విస్మరించింది. పైగా ఆదనంగా పంటల బీమా ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని ఈ నెల 15వ తేదీలోపు చెల్లించాలని గడువు ప్రకటించింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడికి డబ్బులు లేక అప్పు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, దీనికి తోడు బీమా ప్రీమియం పేరుతో రైతులను వేధించడం సరికాదంటున్నారు.

10వేల మంది బాధిత రైతులు

నగరి నియోజవర్గంలోని ఐదు మండలాల్లో 10వేల మందికి పైగా రైతులు ఉండగా, వీరికి 25 వేల ఎకరాల సాగు భూమి ఉంది. వీరందరికి గత ప్రభుత్వ బీమాతోపాటు రైతులకు పెట్టుబడి సాగు కింద రూ.3 కోట్ల వరకు నిధులు చెల్లించేంది. గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ నిధులను రైతు ఖాతాలకు జమ చేస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. కనీసం రబీ సీజన్‌లోనైనా పథకాన్ని అమలు చేస్తారనుకుంటే అదీ లేకుండా పోయింది. దీంతో ఖరీఫ్, రబీ పంటల సాగుకు అన్నదాతలు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

అప్పుల సాగు

నగరి నియోజకవర్గంలోని మండలాల్లో ఈ రబీ సీజన్‌లో వరి, వేరుశనగ, మినుముతోపాటు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూపాయి కూడా అందించపోవడంతో రైతులు బయట అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని అప్పుల పాలవుతున్నారు. మరి కొంత మంది సాగుకు డబ్బులు లేక భూములను బీడుగా వదిలిపెట్టారు.

అన్నదాత సుఖీభవ నిధులివ్వాలి



ప్రభుత్వం రైతుల కోసం ప్రకటించిన అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాలకు జమ చేయాలి. చాలా మంది రైతులు ఈ నిధులు వస్తాయని సాగు పెట్టుబడి కోసం అప్పులు చేసుకున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అన్నదాత సుఖీభవ నిధులను జమ చేయాలి.

– నాగరాజు, మాధవరం

ప్రభుత్వమే చెల్లించాలి..



రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమా ప్రీమియంను గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా చెల్లించాలి. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. అన్నదాతలను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేయాలి. రైతులను అప్పులు కాకుండా కాపాడాలి.

– పాండియన్, కాశికాపురం

అనుభవ సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

నగరి: గ్రామ కంఠంలో అనుభవదారు సర్టిఫికెట్ల కోసం తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు అధికారులకు విన్నవించుకున్నారు. జిల్లా స్థాయి అధికారులేమో గ్రామ కంఠంలో అనుభవదారు సర్టిఫికెట్లు వీఆర్‌ఓలు ఇవ్వాలని చెబుతున్నారన్నారు. అలా సర్టిఫికెట్లు తీసుకెళితే సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఆమోదించడం లేదన్నారు. సర్వేయరు, తహసీల్దార్‌ల వద్ద నుండి సర్టిఫికెట్లు తీసుకురావాలని అంటున్నారన్నారు. జిల్లా స్థాయి అధికారులు ఒక నియమం పెడితే సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఒక నియమం పెడుతున్నారని, ఎవరి దగ్గర సర్టిఫికెట్లు పొందాలని ప్రశ్నించారు. దీనిపై తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో ఈ విషయమై చర్చిస్తామన్నారు. సదస్సులో 30 మంది పాసుపుస్తకాలు, ఇంటి పట్టాలు, డీకేటీ పట్టాలు, సర్వేలకు సంబంధించిన అర్జీలను అధికారులకు సమర్పించారు. ఈ సదస్సులో సర్వేయరు సురేష్, రీ సర్వే అధికారులు, ఫారెస్ట్, ఏపీఐఐసీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పాము హల్‌చల్



పాలసముద్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కట్ల పాము హల్‌చల్ చేసిందని శుక్రవారం పీహెచ్‌సీకి ప్రసవానికి వచ్చిన గర్భిణులు తెలిపారు. గురువారం రాత్రి 12 గంటలకు పైగా వైద్యాధికారి రూమ్ నుంచి కట్ల పాము గర్భిణులు వైద్య పరీక్ష గదికి వచ్చింది. పామును గమనించిన గర్భవతులు, కుటుంబ సభ్యులు లబోదిబోమంటూ కేకలు వేస్తు పీహెచ్‌సీ నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే ఆ పామును చుట్టుపక్కలవారు కొట్టి చంపేశారు.

సదస్సుల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం





నింద్ర రెవెన్యూ సదస్సులో సమస్య తెలియజేస్తున్న రైతు, వెదురుకుప్పం: మొండివెంగనపల్లెలో గ్రామ సభ

నింద్ర: మండలంలోని రెవెన్యూ సమస్యల పరిషారం కోసమే గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ శేషగిరి రావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు రెవెన్యూ సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇంటి స్థలాలకు పట్టాలు తదితర సమస్యలపై 11 వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచ్ వసంతమ్మ, వీఆర్‌ఓ రుక్మిణీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

వెదురుకుప్పం: రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని తహసీల్దార్ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కాపుమొండివెంగనపల్లెలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ భానుమతి, వీఆర్‌ఓ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

రెవెన్యూ సదస్సులో 31 అర్జీలు

పుత్తూరు: తడుకు పంచాయతీలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో వివిధ భూ సమస్యలపై ప్రజలు 31 అర్జీలను రెవెన్యూ అధికారులకు సమర్పించారు. ఇంటి పట్టాల కోసం 15, శ్మశానం దారి కోసం 10, పట్టాదారు పాస్‌బుక్ జారీ కోసం 2, రెవెన్యూ రికార్డుల్లో సవరణల కోసం 1, సెక్షన్ 22ఏ ఫ్రీ హోల్డ్ సంబంధించి 1 అర్జీ ఇచ్చారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్జీలన్నింటిని నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని తెలిపారు.

కనకాంబరమ్మకు మాజీ ఉపముఖ్యమంత్రి నివాళి



కనకాంబరమ్మ మృత దేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్య మంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: మండల పరిధిలోని ఆలత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చిరంజీవిరెడ్డి తల్లి కనకాంబరమ్మ(85) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతోంది. శుక్రవారం మృతి చెందినట్లు సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామానికి వెళ్లి కనకాంబరమ్మ మృత దేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి బాలాజీ, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, అమీద్, లోకనాథనాయుడు, మండల కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ధర్మయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి పాటుపడాలి





విజయపురం : దివ్యాంగుల దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంఈఓ, బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

విజయపురం: దివ్యాంగుల అభివృద్ధికి పాటుపడాలని ఎంఈఓ హరిప్రసాద్‌వర్మ సూచించారు. స్థానిక మండల భవిత కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులను సైకాలజీని బట్టి చదువు అందించాల్సిన బాధ్యత అందరి మీద ఉందని తెలిపారు. ఆదేవిధంగా విద్యార్థులకు ప్రతి వారం రెండు రోజులు ఫిజియోథెరపీ చేయించారని తెలిపారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు విధిగా విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయించాలని, భవిత పాఠశాలలో విద్యను అభ్యసించేసేలా కృషి చేయాలని తెలిపారు. దివ్యాంగుల విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పిస్తోందని, వాటిని తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ఉపయోగించుకోవాలని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జానకిరామిరెడ్డి, శ్రీనివాసులు, భవిత సిబ్బంది శివకుమార్, పుష్ప, ఏఈడీఎస్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులు మనోస్థైర్యాన్ని కోల్పోవద్దు

పాలసముద్రం: విభిన్న ప్రతిభావంతులు మనోస్థైర్యాన్ని కోల్పోకుండా జీవించాలని ఎంఈఓ గిరిజ, హెచ్‌ఎం మీనాక్షి తెలిపారు. శుక్రవారం భవిత కేంద్రంలో ఐఆర్‌టీ టీచర్ బాలాజీ, ఇన్స్‌రాజ్ ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈఓ గిరిజ మాట్లాడుతూ దివ్యాంగులు వికలాంగులకు ఏ మాత్రం తీసిపోరన్నారు. దివ్యాంగులు కూడా సమాజంలో ముందుకు ఎదగాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. నిస్సహాయ స్థితిలో ఉన్న చిన్నారులను అక్కున చేర్చుకుని, సామాన్య ప్రజానీకంతో తలెత్తుకుని తిరిగేలా భవిత ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం దివ్యాంగులైన విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి









అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత నాయకులు, నివాళులర్పిస్తున్న జడ్జి, వెదురుకుప్పం: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నగరి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఈ కార్యక్రమంలో దళిత్ పీపుల్ ఫ్రంట్ నాయకులు బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత్ పీపుల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు గజేంద్రన్ మాట్లాడుతూ నగరి అంబేడ్కర్ విగ్రహం పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన రెండు వైన్ షాపులను తొలగించాలని గత నవంబర్ 26వ తేదీ ఎక్సైజ్ సీఐకి అర్జీ ఇచ్చామని, అయినా కూడా దానిపై స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు. ఎక్సైజ్ అధికారులు ఇదే ధోరణి కొనసాగిస్తే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఎస్‌ఆర్ పురం మండలం పాతపాలెం గ్రామంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని పగలగొట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్వీ యూనివర్సిటీలో ఒక దళిత ప్రొఫెసర్‌పై చేయి చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారిని వెంటనే అరెస్ట్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు ఉమాపతి, ప్రధాన కార్యదర్శి తంగరాజు, ఉప కార్యదర్శి హరి, సంఘ నాయకులు రాజా, సందీప్, సుబ్రమణి, మహేష్, ఎయిల్, తులసిరాం, బాషా తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టులో...

స్థానిక జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టులో అంబేడ్కర్ చిత్రపటానికి జడ్జి విష్ణువర్మ పూజలు చేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం న్యాయవ్యవస్థలో ఎంతటి ప్రాధాన్యత వహిస్తుందో అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ రామశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్, ఉపాధ్యక్షుడు ఈజీ బాబు, ఉపకార్యదర్శి అరుణ్, కోశాధికారి నాగరాజు, సీనియర్ న్యాయవాదులు మురళీధర్, సుబ్రమణ్యంరెడ్డి, మహాదేవన్, సంజీవి, బాబు, దినకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం వెదురుకుప్పంలోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవళంపేటలో బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. తెల్లగుండ్లపల్లె గ్రామంలో బీజేపీ నాయకుడు శేషాద్రి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహన్‌మురళీ, దళిత నాయకులు పొన్నయ్య, ధర్మయ్య, సోమశేఖర్ పాల్గొన్నారు.

నింద్ర: రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం యవజన సంఘం నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీరంగరాజపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని ఎస్ఐ సుమన్ అన్నారు. మండల కేంద్రంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రతకు, ప్రజల హక్కుల రక్షణ కోసం అంబేడ్కర్ ఎంతో కృషి చేసారన్నారు. నేటి యువత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ సరిత జనార్ధన్, తహశీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ మోహన్‌మురళి పాల్గొన్నారు.

పాలసముద్రంలో..


పాలసముద్రం: మండలంలోని అన్ని పంచాయతీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, సర్పంచ్ అయ్యప్ప, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మురుగేష్, దళిత నాయకులు పాల్గొన్నారు.

వడమాలపేటలో..

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండల కేంద్రంలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జయంత్‌బాబు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ దేవరాయులు, ఉపాధ్యక్షుడు గురవయ్య, డేవిడ్, వెంకటస్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయులని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మునివేలు పేర్కొన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక నగరం రోడ్డు సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. సమానత్వాన్ని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. శివయ్య, వినోద్‌కుమార్, నాయకులు దొరబాబు, శ్రీరామ్, పార్థు, నాదముని తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆరాధ్య దైవం అంబేడ్కర్



కృపాలక్ష్మి

గంగాధరనెల్లూరు: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని దేశంలోనే పూర్తిస్థాయిలో అమలు పరిచిన ఏకై క నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ చరిత్రలో దేశంలోనే ఎక్కడా లేనివిధంగా విజయవాడ నడిబొడ్డున అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించిన ఏకైక నాయకుడు జగనన్న అని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడిన ఏకైక వ్యక్తి అని కొనియాడారు. దళితులకు ఆరాధ్య దైవం అంబేడ్కర్ అని అన్నారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం

గంగాధరనెల్లూరు: యుక్త వయసు బాలికలకు వివాహాలు చేయడం ద్వారా అనారోగ్య సమస్యలతో నిరంతరం బాధపడాల్సి వస్తుందని సీడీపీఓ వినుత శ్రీ, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి అన్నారు. గంగాధరనెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమంపై సచివాలయం ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్య దుర్గాదేవి, యోగ మాస్టర్ గోపికృష్ణ, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రమ, సంగీత, లెక్చరర్ మురళి, భూపతి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ ఫుట్‌బాల్ జట్టులోకి పుత్తూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టుకు కళాశాలకు చెందిన విద్యార్థులు ఎ.దిలీప్, టి.ఉదయ్‌కుమార్, కె.శ్రీనివాసులు ఎంపికైనట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు ఈ నెల 21వ తేదీ నుంచి 29 వరకు కేరళ రాష్ట్రంలో జరిగే కాలికట్ అంతర్ విశ్వవిద్యాలయ క్రీడల్లో (సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ గేమ్స్) పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, వ్యాయామ విభాగాధిపతి సూర్యబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.